కథ

# కరటం

కడెం లక్ష్మీప్రశాంతి
78933 99773

కళ్లు తెరిచిన కొంతసేపటికి కానీ అర్థం కాలేదు.. ఐసీయూలో ఉన్నానని. ఆక్సిజన్ మాస్క్‌తో, ఒంటినిండా రకరకాల వైర్లతో హాస్పిటల్‌లో ఎందుకు ఉన్నానో వెంటనే స్ఫురణకు రాలేదు. మెల్లగా తల పక్కకు తిప్పి చూసిన నాకు.. సెలైన్ మార్చుతున్న నర్స్ కనిపించింది. నేను స్పృహలోకి రావడం చూసి హడావిడిగా బయటికి పరిగెత్తిన ఆమె.. ఐదు నిమిషాల్లో డాక్టర్‌తో సహా ప్రత్యక్షమైంది.

''ఇప్పుడెలా ఉంది కడలీ?''.. నాకు ఇంజక్షన్ ఇస్తూనే అడిగాడు అతను.

''నాకేమైంది డాక్టర్?''.. అతికష్టం మీద గొంతు పెగల్చుకొని అడిగాను.

నా మాట నాకే బలహీనంగా వినిపిస్తున్నది.

''చిన్న యాక్సిడెంట్ అయింది. డోంట్ వర్రీ! త్వరలోనే క్యూర్ అవుతుంది''.. ప్రశాంత వదనంతో చెప్పి, నర్స్‌కి కొన్ని సూచనలు ఇచ్చి వెళ్లిపోయాడు. డాక్టర్ చెప్పింది నాకేమాత్రం నమ్మాలనిపించ లేదు.

'ఏదో జరిగింది?' అని నా బుద్ధి చెబుతూనే ఉన్నది.

''నాకేమైంది సిస్టర్?''.. సెలైన్‌లోకి మెడిసిన్ ఇంజెక్ట్ చేస్తున్న నర్స్‌ని అడిగాను.

''ఎక్కువ అలోచించి స్ట్రెయిన్ అవ్వకండి మేడం! రెస్ట్ తీసుకోండి''..

నా ప్రశ్నకు సంబంధం లేని సమాధానం ఇచ్చింది. ఆమె కళ్లలో అంతులేని సానుభూతి కనిపిస్తున్నది. వీళ్లనడిగి లాభం లేదని అర్థమై.. నాకేం జరిగిందో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

* * *

ప్రాజెక్ట్ వర్క్ అర్జెంట్‌గా పూర్తి చెయ్యాల్సి రావడంతో రోజూకంటే ఆలస్యం అయింది ఆఫీస్‌లో. టీమ్ మెంబెర్స్ అంతా గుడ్‌నైట్ చెప్పుకొని.. ఎవరి గమ్యస్థానానికి వారు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. క్యాబ్ ఇంకా రాకపోవడంతో కాల్ చేద్దామని బ్యాగులోంచి ఫోన్ తీసుకున్నాను. క్యాబ్ సంబంధిత సర్వీస్ నుంచి అప్పటికే వచ్చిన 'క్యాబ్ క్యాన్సిలేషన్ మెసేజ్' చూసి.. ఎక్కడలేని అసహనం ముంచుకొచ్చింది. ఎంత ప్రయత్నించినా మరే క్యాబ్ బుక్ కాకపోవడంతో ఏంచేయాలో అర్థం కాలేదు.

''నువ్వింకా వెళ్లలేదా?''.. మాటలు వినిపించడంతో పక్కకు తిరిగి చూశాను.

నవ్వుతూ నన్నే చూస్తున్నాడు మహి. మహి.. నా కొలీగ్. రెండేళ్ల క్రితం నాతోపాటే జాయిన్ అయ్యాడు. ఇప్పుడు ఒకే టీమ్‌లో పనిచేస్తున్నాం. అతనికి విషయం చెప్పాను.

''డోంట్ వర్రీ కడలీ! నా కార్‌లో డ్రాప్ చేస్తా!'' అంటూ నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా పార్కింగ్‌వైపు వెళ్లాడు.

కార్‌తో నా ముందు కొచ్చి..

''కమాన్!'' అన్నాడు కార్ డోర్ తీస్తూ.

''నీకెందుకు శ్రమ. నేను ఆటోలో వెళ్లిపోతాను''.

''డోంట్ బీ సిల్లీ! ఇప్పటికే బాగా లేట్

